# "నన్ను వదలి నీవు పోలేవులే ...!"

## 'నన్ను వదలి నీవు పోలేవులే ... ఇదీ నిజములే ...
## పూవులేక తావి విలువ లేదులే ... లేదులే ...

**రేడియోలో ఘంటశాల, సుశీలగార్ల యుగళ గానం ...** నన్ను, నా పని నుండి నా ధ్యాసను... కొంత మళ్ళించింది. అది ఒక సాధారణ ప్రేమ గీతమే! అయినా, ఆ 'ప్రేమ'ను భగవంతుడి వరముగా ప్రేమగా అన్వయించుకొంటే ఎంత గొప్పగానో అనిపించింది.

నిజమే కదా! భగవానులు మన జీవితాలలో ఎంతగా ఒక అంతర్భాగమైపోయారంటే ... ఆయనను వదలి మనము ఎక్కడికీ, ఎన్నటికీ పోలేనంతగా ... అంతేకాదు, ఆయన 'ప్రేమ' ఒక కుసుమమైతే, ఆ పుష్పం యొక్క 'పరిమళం' కూడా దానితో పాటే ఉంటుంది; కానీ, పూవులేని తావి విలువ ఏముంటుంది? అనిపించింది.

మా జీవితాలు పుట్టుకనుండే భగవానులతో అనుబంధం కలిగి వుండటం మా అదృష్టం! మా ఇరువురి కుటుంబాలు 1954 నుండే స్వామి దివ్య ప్రేమక్షేత్రంలో వారి దివ్య ఛాయలో సేదదీరటం; మా ఇరువురి వివాహం స్వామివారి దివ్యసన్నిధిన జరగటం అన్న నేపథ్యంలో...

మా ఇరువురి జీవితాలు... స్వామి సంస్థలో సభ్యులుగా చేరటం... సేవాదళ సభ్యులుగా శిక్షణ పొందటంనుండి .... ఇంట్లోనే భజన మండలి, సమితి నిర్వహించటం ... మా జీవితాలలో స్వామి బోధనలను, సంస్థ నియమనిబంధనల క్రమశిక్షణను తు.చ.తప్పకుండా పాటించటం...వృత్తి ఉద్యోగాలలో నైతికవిలువలు ఆచరించటం ... మా పిల్లల్ని కూడా స్వామి బిడ్డలుగానే భావించి, వారిని స్వామి కోరుకొనే పద్ధతులలో పెంచటం, విద్యాబుద్ధులు చెప్పించటం... మాకు భగవంతుడు అనుగ్రహించిన ఆర్థిక, మానవ వనరులలో కొంతభాగాన్ని సాయి సంస్థల కార్యక్రమాలకై వినియోగించ గలిగే అవకాశం లభించటం... అనునిత్యమూ మా ఇంట్లో ప్రశాంతి నిలయంలో వలె సుప్రభాత, నామ సంకీర్తనలు... సరిగ్గా అదే సమయాల్లో స్వామికి హారతి ఇవ్వటం ... ఇలా గడిచిపోతోంది మా ఈ సాయి 'కుటుంబ' జీవనం ...

ఇప్పుడు వెనుకకు తిరిగి చూచుకొంటే – గత ఇన్ని దశాబ్దాలుగా మా జీవితాలు పట్టి నడిపిస్తున్న భగవానులే ... క్రమశిక్షణగల సాయిసేవకులుగా మాకు సంస్థలో సేవల అవకాశాలను దండిగా ఏ విధంగా అనుగ్రహిస్తున్నారో తలుచు కుంటే ...

హైదరాబాదులో మొదటి దీనజనోద్ధరణ పథక కేంద్రం మా గృహంలోనే, మా పిల్లలతోపాటే ... ఆ ఐదారుగురు పిల్లల్ని మా కుటుంబ సభ్యులుగా స్వీకరించి నిర్వహించటం ... ఆ మొదటి బ్యాచ్ పిల్లలను 'సరూర్‌నగర్' సమితివారు దత్తత చేసుకొని తీసుకొని వెళ్ళిన తరువాత – మళ్ళీ ఇంకొక బ్యాచ్ పిల్లలను, మా పిల్లలతోపాటే వారిని పెంచుతూ, ప్రస్తుత దీనజనోద్ధరణ కేంద్రం 8 సం॥లుగా మా గృహంలోనే నిర్వహించటం ... ఆ పిల్లలలో కొంతమంది ఉన్నత విద్యా సంస్థలలో చేరి వారి జీవితాలకు మంచి మార్గం వేసుకోవటం ... మరికొందరు ఉన్నతోద్యోగాలలో ప్రవేశించటం... వీటన్నింటిలో స్వామి మాకు అనుగ్రహించిన పాత్ర మా జీవితాలను ధన్యము గావించింది!

నెల విడిచి నెల దూర దేశాల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే, 2012లో మొట్టమొదటిసారిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శ్రీ సత్యసాయి సేవాసంస్థల కోసం ఒక వెబ్‌సైట్ **www. gramaseva.com** నిర్మాణ నిర్వాహణ బాధ్యతలు – రాష్ట్రాధ్యక్షులు శ్రీ ఎస్.జి. చలం గారి ప్రోత్సాహ సహకారాలతో చేబట్టటం ... భగవంతుడు అనుగ్రహించిన మరొక అద్భుత సేవావకాశం! ప్రపంచస్థాయి వెబ్‌సైట్ జూమ్లా వెబ్ కంటెంట్ మేనేజిమెంట్ మాడ్యూల్‌లో మన రాష్ట్ర వెబ్‌సైట్ రూపొందిం చటం జరిగింది. ఎలాంటి వ్యాపార ప్రకటనలు లేకుండా, పూర్తిగా సురక్షితమైన పద్ధతులలో నడిపే వెబ్‌సైట్ ఇది. స్వామి దివ్య సందేశాలతోను; రాష్ట్రంలోని అన్ని జిల్లాల సేవా సమాచా రములు సచిత్రముగా ఎప్పటికప్పుడు తాజాగానూ; సంస్థాగత నిర్మాణ వ్యవస్థా విశేషాలు; రాష్ట్రాధ్యక్షులవారి అధికారిక సర్క్యులర్లు; ఇతరత్రా సాయిసంస్థల సమగ్ర సమాచార

విశేషాలు; ఈ విధంగా అన్ని రకాల విశేషాలు, భజనలు, వీడియోలతో కూర్చి నడుపుతున్న ఈ 'వెబ్‌సైట్'ని మన రాష్ట్ర వాసులేకాకుండా, దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలవారు, మరియు అమెరికా, ల్యాటిన్ అమెరికా, ఇంగ్లాండు, ఇంకా 'దుబాయి' వంటి ముస్లిమ్ దేశాలవారూ క్రమం తప్పకుండా దర్శిస్తూ, ప్రశాంతి నిలయ సమాచారం, హాస్పిటల్ వివరాలు, స్వామివారి ప్రబోధాల గురించిన విపులీకరణల కోసం మనకు అనేక అభ్యర్థనలు పంపిస్తున్నారు.

రాష్ట్రంలోని ప్రతిజిల్లా నుండి సాయిసంస్థల సేవా సమాచార నివేదికలను ఎప్పటికప్పుడు తాజాగా మన **'గ్రామ సేవా డాట్ కామ్'** వెబ్‌సైట్‌కి 'రిపోర్ట్' చేయటానికీ, సమాచారం, ఫోటోలు వెబ్‌సైట్‌లో పెట్టటానికీ (అప్‌లోడ్ చేయటానికీ) – 'వెబ్‌మాస్టర్'గా బాధ్యత వహిస్తున్న నాకు సహాయ సహకారాలు అందించటానికి గాను, **'వెబ్‌సైట్ మేనేజిమెంట్'** లో బాగా అనుభవం కల ఇద్దరు నిష్ణాతులైన కార్యకర్తలు వెబ్‌సైట్‌ను ఎప్పటికప్పుడు రోజువారీ ప్రాతిపదికపై తాజాగా 'అప్‌డేట్' చేస్తూ, కార్యక్రమాలను 'సైట్'లో ప్రచురిస్తున్నారు. వీరికి ప్రతిజిల్లా నుండి సమాచారం అంద జేయటానికి 23 జిల్లాలనుండి **"జిల్లా ఆర్కైవ్స్ ఇన్‌ఛార్జి"**లను ఎంపికచేసి 'ఆన్‌లైన్'లో నివేదికలు సమర్పించి, వాటిని 'అప్‌లోడ్' చేయటం గురించి, **"మీ నివేదికలు మీరే వెబ్‌సైట్‌లో పెట్టటం ఎలా?"** అనే అంశంపై 2012 డిసెంబరు 16 నాడు విశాఖపట్నంలో జిల్లా ఆర్కైవ్స్ ఇన్‌ఛార్జీలకు శిక్షణా శిబిరం నిర్వహించాము. అదే విధంగా తిరుపతి, విజయవాడలలో కూడా రెండవ విడత శిక్షణా శిబిరాలు నిర్వహించాము.

పై శిక్షణల ఫలితంగా, జిల్లా ఆర్కైవ్స్ ఇన్‌ఛార్జీలు, వెబ్‌సైట్ నిర్వాహక బృందం వారి సహకారంలో గత సంవత్సర కాలంలో సుమారు 1000 కార్యక్రమాల నివేదికలు, రాష్ట్రస్థాయి కార్యక్రమాల వివరాలు, మన వెబ్‌సైట్‌లో పొందు పరచ గలిగాము. రాష్ట్రాధ్యక్షుల అధికారిక సర్క్యులర్స్ అన్నీ దాదాపు 100, ఒక ప్రత్యేక ఫోల్డర్‌లో స్టేట్ ప్రెసిడెంట్ పేజిలో ఎప్పటికప్పుడు పొందుపరచటం వల్ల, రాష్ట్ర వ్యాప్తంగా కార్యకర్త లందరికీ ఎంతగానో ఉపయోగపడుతోంది.

మన గ్రామసేవ డాట్‌కామ్ వెబ్‌సైట్ చూసి ఎంతగానో కొనియాడిన వారిలో అమెరికా సంయుక్త రాష్ట్రాల శ్రీ సత్యసాయి సేవాసంస్థల సాంకేతిక నిపుణులు, ప్రపంచ ప్రఖ్యాతులూ అయిన డేవిడ్ గ్రైస్, జీన్ మ్యాసీ (ప్రఖ్యాత హాలీవుడ్ చలనచిత్ర దర్శకులు) ప్రభృతులు, అఖిల భారత శ్రీ సత్యసాయి సంస్థల టెక్నోగ్రూప్ సమన్వయకర్త శ్రీ హెచ్. శ్రీనివాసులుగారివంటి అనేకులు ఉండటం వెబ్‌మాస్టర్‌గా నా భాగ్యముగా భావిస్తున్నాను.

మన **గ్రామసేవా డాట్‌కామ్ వెబ్‌సైట్** పై ప్రముఖులను ఎంతగా ఆకట్టుకొందంటే, భారతదేశంలోని వివిధ రాష్ట్రాలలో శ్రీ సత్యసాయిసేవాసంస్థల విశేష సేవలపై ఒక డాక్యుమెంటరీ చిత్రము నిర్మించాలని **జీన్ మ్యాసీ గారు** సంకల్పించినప్పుడు, అట్టి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులో వారితో కలిసి పనిచేసే చక్కటి అవకాశంకూడా మనకు అనుగ్రహించారు స్వామి. అంతేకాదు, అంతర్జాతీయ సాయిసంస్థల అధికారిక వెబ్‌సైట్ నిర్వాహకులు **డేవిడ్ గ్రైస్ గారు** మన గ్రామసేవ డాట్‌కామ్ వెబ్ సైట్‌కు వారి అంతర్జాతీయ వెబ్‌సైట్‌లో స్థానం కల్పించారు.

అన్నింటికన్నా ఆనందించదగ్గ మరొక విశేషం – ప్రపంచ వ్యాప్తంగా వివిధ ఖండాలలో, అన్ని దేశాలలో శ్రీ సత్యసాయి సేవాసంస్థలు చేపట్టే అత్యంత ప్రతిష్ఠాత్మక, అద్వితీయ విశిష్ట సేవా పథకాలతో రూపొందించే **"సాయి లవ్ ఇన్ యాక్షన్" (http://sailoveinaction.org)** అనే వెబ్‌సైట్ యొక్క అంతర్జాతీయ నిర్వాహకులలో భారతదేశం నుండి ప్రతినిధిగా (పర్సన్ – ఇన్ – ఛార్జిగా) ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నాకు సేవావకాశం లభించటం భగవాన్ అనుగ్రహ ప్రసాదంగానే భావిస్తున్నాను. పై **'సాయి లవ్ ఇన్ యాక్షన్ గ్లోబల్ సైట్' లో భారతదేశం నుండి అతి ముఖ్యమైన 25 సేవా ప్రాజెక్టుల విశేషాలను సచిత్రముగా ప్రచురించటం జరిగింది....**

ఎక్కడి మహబూబ్‌నగర్ జిల్లా? ఎక్కడి అంతర్జాతీయ సాయి సంస్థల విశ్వవ్యాప్త సేవల అవకాశాలు? ఈ మహా ప్రస్థానంలో కేవలం అమాయకుడైన ఒక కుమారుడినీ, అతని కుటుంబాన్నీ, 'ప్రేమమూర్తి' యైన తండ్రివలె, సంరక్షకుని వలె జాగ్రత్తగా చేయిపట్టి, సుతారముగా, కష్టం తెలియనీయ కుండా నడిపిస్తూ సేవాపథంలో ఉన్నత శిఖరాలవైపు గమింపజేస్తున్న భగవాన్ బాబావారి చేయివదలక, గట్టిగా పట్టుకొని, వారిని అనుసరించటమేగాక, వారి దివ్యప్రేమ నీడలో సురక్షితంగా జీవితాలను భగవసాగరపు అవతలి తీరాలకు కొనసాగించటమే కర్తవ్యంగా నేను భావిస్తున్నాను. ఈ దివ్యజీవన ప్రయాణంలో అన్ని విధాలా అనుకూలవతియై, నాకు తోడుగా నిలుస్తున్న జీవన సహచరి నా శ్రీమతికీ, మమ్ములను చక్కగా అనుసరిస్తూ ఆదర్శ సాయి కుటుంబ సభ్యులుగా జీవితాలు సాగిస్తున్న నా బిడ్డలకూ, ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేయటం నా విధి!

మా కుటుంబం వంటి సాయి కుటుంబాలు ఈ రాష్ట్రంలో, ఈ దేశంలో, ఈ ప్రపంచంలో ఎన్నో వేనవేలుగా ఉన్నాయి. ఆ వాస్తవం మీ అందరికీ తెలియజేయటానికే నా కుటుంబ ఆదర్శ సాయి జీవనం గురించి వ్రాశాను. అంతేగానీ మా కుటుంబం ఏదో ప్రత్యేకమైందని నా ఉద్దేశ్యం కాదు.

ఈ విధంగా, ఒక తండ్రిగా.. తమ ప్రియతమ బిడ్డల జీవితాల సర్వస్వమై, మనందరి జీవితాలలో మమేకమైన మన భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు –

**"నన్ను వదలి నీవు పోలేవులే ... ఇదీ నిజములే**
**పూవులేక తావి విలువలేదులే ... లేదులే!"**

అని మనతో అనటం ఎంతటి మహోన్నత వాస్తవమో కదా!

నిజమే మరి! సాయిని వదలి మనము కానీ, మనలను వదలి సాయి కానీ ఎక్కడికీ ఎన్నటికీ పోలేమని స్వామివారే స్వయంగా తమ 60వ జన్మదినోత్సవ దివ్యోపన్యాసంలోనే చెప్పారుకదా! మరి అలాంటి దివ్య పితరులకు మనము ఏ విధంగా సమాధానం చెప్పగలమా, అని ఆలోచిస్తుంటే – మన కర్తవ్యాన్ని గుర్తుచేస్తూ – ఘంటశాలగారి మరొక గీతం రేడియోలో నుండి ఖంగుమంటూ మ్రోగుతోంది ...

**"నిన్ను తలచి, గుణగానము చేసి...**
**దివ్యనామ మధుపానము చేసి...**
**సారసాక్ష! మనసా వచసా...**
**నీ సరస చేరగనే ...**
**సదా... ఏలు దొరవు...**
**అరమరికలు లేక...**
**ఏలవేల? సరసాల సురశాల ...**
**రసిక రాజ, తగువారము కామా ...!?"**

ఇంతకన్న దివ్యప్రేమ గానము మరి ఇంకేముంటుంది చెప్పండి ...?

**డి. విష్ణువర్ధన్ రావు**
**(9440896720)**
**గ్రామసేవ డాట్ కామ్ స్టేట్ వెబ్‌సైట్**
**నిర్వాహకులు, వెబ్‌మాస్టర్**
**info@gramaseva.com**
**'సాయి లవ్ ఇన్ యాక్షన్' గ్లోబల్ వెబ్ సైట్**
**భారతీయ ప్రతినిధి**
**స్టేట్ రివ్యూ టీమ్ సభ్యులు**
**శ్రీ సత్యసాయి సేవాసంస్థలు, ఆంధ్రప్రదేశ్**

## 2014 నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు !!

**'సాయి సేవా ఝరి' మాసపత్రిక పాఠకులు, రచయితలు, నివేదికల సమర్పకులు, శ్రీ సత్యసాయి సేవా సంస్థల సభ్యులు, క్రియాశీలక కార్యకర్తలు, వివిధ పదాధికారులు, అందరికీ 2014 నూతన ఆంగ్ల సంవత్సరాది శుభాగమన శుభ సందర్భంలో ఇవే మా హృదయపూర్వక శుభాకాంక్షలు! ఈ నూతన సంవత్సరంలో నూతన సమధి కోత్సాహంతో, మరింత సేవానందాన్ని మీ అందరితో పంచుకోవాలనే కృషిలో భాగంగా మన పత్రికను మరిన్ని వినూత్న శీర్షికలతో మీ ముందుకు తీసుకు రావాలని మా ఆకాంక్ష! మన పత్రిక మీ అందరికీ మరింత ప్రయోజనకరమగునటుల రూపుదిద్దు కోవటంలో మీ అందరి ఆదరాభిమానాలు, ఉత్సాహ ప్రోత్సాహాలు కోరుకుంటూ, మీ ...**

**"చలం"**
**ప్రచురణ కర్త, "సాయి సేవా ఝరి"**